మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

సాసోంకే తార్ పర్, ధడకన్ కీ తాల్ పర్

దిల్ కీ పూర్ కా, రంగ్ భరే ప్యార్ కా

గీత్ గాయా పత్థరో నే

1965లో విడుదలయిన 'గీత్ గాయా పత్థరోంనే' సినిమా దర్శకుడు వి.శాంతారాం. హిందీ చలనచిత్ర సీమలో అత్యంత సున్నితమూ, అర్థవంతమూ, ఆదర్శవంతమూ అయిన సినిమాలను ఉత్తమ విలువలతో ఏమాత్రం రాజీపడకుండా రూపొందించి అటు క్లాస్‌నూ ఇటు 'మాస్'నూ మెప్పించిన వాడు వి. శాంతారాం. కళాకారుల మనస్తత్వాలను ప్రదర్శించటం వి.శాంతారాంకు అతి ఇష్టమైన విషయం. 'ఝనక్ ఝనక్ పాయల్ బాజే' సినిమాలో నృత్యకారుల అంతరంగాలను ప్రదర్శించాడు. 'నవరంగ్'లో కవి సృజనాత్మక ఆవేశాన్ని, సృజన ప్రక్రియను ప్రదర్శించాడు. 'గీత గాయా పత్థరోంనె' సినిమాలో శిల్పి కళా సృజన మనస్తత్వాన్ని, అత్యద్భుతంగా ప్రదర్శించాడు.

ఒక శిల్పి తన మనోఫలకంపై దర్శించిన భావనకు ఆకారాన్నిచ్చి, దాన్ని శిలపై ప్రతిష్టించే ప్రక్రియకు దృశ్య రూపం కల్పించాడు వి. శాంతారాం ఈ సినిమాలో. ఒక కళాకారుడికి ప్రేరణ రావటం, ప్రేరణ కలిగిన తరువాత దాన్ని వ్యక్తపరచేవరకూ కళాకారుడూ నిలవలేక పోవటం, వ్యక్తపరచే సమయంలోనూ కలిగే సందిగ్ధాలు, భావాలు ఏ రకంగా కళాసృజన ఒక తపస్సు వంటిదో, కళాకారుడి అంతరంగంలోని వ్యక్తీకరణనో అత్యద్భుతంగా ప్రదర్శిస్తాడు శాంతారాం ఈ సినిమాలో.

'ఊపిరి తీగపై, హృదయ లయ ఆధారంగా, ప్రేమరంగు నింపుకున్న హృదయపు స్వరంతో శిలలు పాట పాడాయి' అన్నది ఈ పాట పల్లవి అర్థం. అంటే శిల్పి తన కళలను శిలలపై నిలపటాన్ని శిలలు గానం చేసే పాటగా అభివర్ణిస్తున్నాడు కవి. ఆ పాటను ఎలా పాడుతున్నాయి రాళ్లు అంటే కళాకారుడి ఊపిరి అనే తీగపై, హృదయ లయతో ప్రేమ నిండిన హృదయ స్వరంతో పాటను పాడుతున్నాయి శిలలు. అద్భుతమైన వర్ణన.

శిల్పి ఓ అందమైన అమ్మాయిని చూస్తాడు. ఆమె అతడిలో ఆవేశం కలిగిస్తుంది. ఆవేదన రగిలిస్తుంది. సంచలనం కలుగుతుంది.సృజన ఊపిరులూదుతుంది. సముద్ర మధనం వల్లనే అమృతం ఉద్భవిస్తుంది. ఆ మధనానికి ప్రేరణ ఆ అమ్మాయి 'అందం.'

'అందం' అన్నది సాపేక్షం. ఒకరికి ప్రాణం మరగించేంత అందం, మరొకరికి వాంతి కలిగించే కారణం కావచ్చు. ఒకరికి కళాసృజనకు ప్రేరణనిచ్చిన అందం మరొకరిలో ఎలాంటి స్పందన కలిగించని సాధారణం అవచ్చు. అందుకే ఎవరికి ఏ అందం ప్రేరణనిస్తుందో చెప్పటం కష్టం. కానీ ఆ ప్రేరణ ఫలితంగా సృజించిన కళ మాత్రం సార్వజనీనం. అది అత్యధికులకు తరతరాలుగా ఆనందానిచ్చే 'అందం'గా నిలుస్తుంది. ప్రేమతో సృజించిన కళ 'చిరంజీవి'గా నిలుస్తుంది. ద్వేషంలో, ఆవేశంలో సృజించే కళకు అంతగా విలువ ఉండదు. కళాకారుడికి కావలిసింది సృజనాత్మక ఆవేశం. ఈ నిజాన్ని మరో పాటలో ప్రదర్శిస్తాడు శాంతారాం.

అమ్మాయి అందం నుంచి ప్రేరణ పొంది, ఆమె గురించే ఆలోచిస్తూ, తన ఆవేశాన్ని కళారూపంలో శిలపై నిక్షిప్తం చేసేందుకు, తన భావావేశాన్ని బండరాళ్ళ వేదికపై అభివ్యక్తం చేసేందుకు సిద్ధమౌతాడు శిల్పి. కవికి కాగితం, చిత్రకాతుడికి కాన్వాస్ ఎలాగో, శిల్పికి బండరాళ్ళు అలాగ. అతడి ఆలోచనల్లో, మనస్సులో 'ఆమె'నే నిలుస్తుంది. అతను ఆవేశంగా శిలపై శిల్పాన్ని మలుస్తూంటాడు. ఆ సమయంలో అతను అతను కాదు. అతను కళాకారుడు. అప్పుడు వస్తుంది పాట ఆశాభోస్లే స్వరంలో.

తేరే ఖయాలోంమె హం తెరీహి బాహోంమె హం

అప్నే హై దోనో జహాన్, హోజాయె బేఖుద్ యహాన్.

హస్రజ్ జైపురి విజృంభించి రాసిన గీతాలివి. సాధారణంగా హస్రిత్ జైపురికి మాములు రొటీన్ సన్నివేశాల పాటలు రాసే అవకాశాలు అధికంగా వస్తూంటాయి. అప్పుడప్పుడూ ఇలా కవిత్వం గుప్పించగలిగే సున్నితమైన గీతాలు రచించే అవకాశం వస్తుంది. ఆ అవకాశాన్ని సంపూర్ణంగా సద్వినియోగం చేసుకున్నాడు హస్రత్. 'శాంతారాం' కూడా భరత్ వ్యాస్‌నే అధికశాతం గేయ రచయితగా ఇష్టపడతాడు. 'హస్రత్'ను ప్రధమంగా 'సెహ్రా' సినిమాలో ఎంచుకున్నాడు. ఇది రెండవ సినిమా.

నీ ఆలోచనలలో నేను. నీ బాహువులలో నేను. నేనుండేది ఈ రెండు స్థలాలో, నీ ఆలోచనలలో, నీ బాహువుల్లో... ఇక్కడే నన్ను నేను మరచిపోతాను. ఇదీ అత్యంత ప్రతీకాత్మకము అర్థవంతమైన పాట పల్లవి. ఒక కళాకారుడికి 'అందం' ప్రేరణ. ఒక మనిషిలోని అందం అలజడి కలిగించేది మనసులో అంటే, ఆలోచనల్లో. కాబట్టి అతడి ఆలోచనల్లో ఆమె ఉంటుంది. అముక్షణం అతని ఆలోచనల్లో ఆమెనే ఉంటుంది. లేకపోతే అలజడి లేదు. ప్రేరణ లేదు. ఆ అలజడి ఫలితంగా అతడు కళను సృజిస్తాడు. సినిమా శిల్ప కళకు సంబంధించినది కాబట్టి ఆమె అతని బాహువుల్లో ఉంటుంది. ఈ రెండు స్థలాలే ఆమె ఉండగలిగేది. మెదడులో సంచలనం కలగాలి. అతని బాహువుల ద్వారా ఆ సంచలనం కళ రూపంలో ప్రకటితమవ్వాలి. 'కళ' రూపంలో ప్రకటితమయిన తరువాత ప్రేరణకు ప్రత్యేక అస్తిత్వం ఉండదు. గమనిస్తే, ప్రేరణకూ, కళ రూపంలో వ్యక్తమయిన భావనకూ ఎంతో తేడా ఉంటుంది. వ్యక్తమయిన కళ ఆధారంగా మూల ప్రేరణను ఊహించటం కూడా కష్టం. అందుకే ఆమె 'బేఖుద్' అయిపోయింది.

హూం రోషనీ భోర్ కీ పల్కోం పె తెరీ ఛుపీ'

జబ్ ఆంఖ్ ఖోలేగా తు, పుత్‌లీ మె హోంగె హం హీ

హం హై కలాకీ జబాన్, ఆంఖోం మె తేరే రవా...

అతని ప్రేరణ అంటోంది. నేను ఉదయ సూర్య కిరణాల వెలుగును, నీ కనురెప్పలలో దాగి ఉన్నాను. నువ్వు కళ్ళు తెరిస్తే, నీ కంటి పాపలో ఉండేది నేనే. నేను కళకు భాషను, నీ కంటిలోని అణువును. అద్భుతమైన భావం.

ఒకసారి కళాకారుడి మనసులో ఒక కళాసృష్టి బీజం నాటుకుందంటే అతనికి రాత్రిబవళ్లు దానిపైనే ధ్యాస ఉంటుంది. ప్రపంచం అదృశ్యమైపోతుంది. అదొక తపస్సులాంటిది. ఇతరులకి అది పిచ్చిలాగా, పైత్యంలాగా అనిపిస్తుంది. కానీ 'కళ'ను సృష్టిస్తేకానీ కళాకారుడికి 'శాంతి'ఉండదు. పైకి అతడీ ప్రపంచంలో ఉన్నట్టనిపిస్తున్నా , ఈ ప్రపంచంలో ఉండడు. దాన్నే వర్ణిస్తోంది ఆమె.

మద్ భరిచంచల్ యె షాం,

దేతీ హై తుఝుకో పయాం'

పద్ధర్ పై కర్ షాయరీ, తుఝూ కో హమారా సలాం

తూహై జహా, హం వహా, ఝూమే జమీన్ అస్మాన్.

అతని చుట్టూ ఉన్న వాతావరణం, రాతిపై కవిత్వం లభించమని అతనికి సందేశాన్ని ఇస్తున్నాయి. అంటే, కళను సృజించమని ప్రోత్సాహాన్నిస్తున్నాయి. రాతిపై కవిత్వాన్ని లిఖించమని అంటున్నాయి. అతను చెక్కే శిల్పాలన్నీ రాతిపై కవిత్వం రాయటం అన్నమాట. అతి రమ్యమైన ఊహ.

నీ ఉలి చూచి ప్రస్తరము

నీరయి పారును: వెన్నముద్దపై

చేయిడిమెత్తినట్టుల, ని

శీధములందభి సారికా పదా

బ్జాయుత రాగరంజిత న

వారుణ కంటకపాళి గూర్చి, నే

గేయము వ్రాసినట్లు విలి

ఖింతువు లోతగు భావముల్ శిలన్..

దాశరథి రచించిన 'శిల్పి' కవిత గుర్తుకు రాకమానదు. కవి గేయము రాసినట్టు శిల్పి లోతయిన భావాలు శిలలో విలిఖిస్తాడట. 'పత్థర్ పె కర్ షాయరీ' ఈ భావనకు ప్రతిధ్వని లాంటది .

చాగిల దీసి రాళ్లనొక

జాలుగ, వాగుగ, తోగులాగుననన్

లాగెద వెట్టులున్న నటు

లన్ ప్రియురాలి పయంటలో అజం

తా గుహలోని స్వప్నములు

తాపిన నీ ఉలి ముక్కు లోపలన్

దాగుడు మూతలాడె కవి

తా లలితాంగి రహో విహారముల్.

'నీ ఉలి ముక్కులోపల దాగె కవితా లలితాంగి రహో విహారముల్! ' కవి ఉలినుంచి రాతిపైకి జాలువారుతున్నది కవితా లలితాంగి. అందుకే 'ఆమె తేరీ హి బాహోంమెహం అంది. అతని మేధలో నిలచి కవిత రస ప్రవాహమై. అతని ఉలిద్వారా రాయి పైకి ప్రసరిస్తున్నది కవితా లలితాంగి. 'పత్థర్ పె కర్ షాయరీ'

ఈ పాటతో శిల్పి శిల్పాలు చెక్కటం ఆరంభమవుతుంది. అతని ప్రేరణ అతని జీవిత భాగస్వామిగా మారినప్పుడు అతని సృజనాత్మకత పరవళ్లు త్రొక్కుతుంది. ఎలాగంటే, ఉచ్వాశ నిశ్వాసాల తీగలపై, గుండె లయతో, ప్రేమ నిండిన హృదయంతో రాళ్లు పాడే పాటలా!

పథ్ రీలె హోటోంసె నిక్‌లా హై నగ్మా

అల్బేలా, గర్దీలా, మస్తీ భరా జిందగీకా

చమ్కె మహబ్బత్ కి పహలూ హజారో

పైగాం హై బేఖుదీకా

మౌసం కె సాజ్ పర్, మస్తానీ గూంజ్ మే

దిల్‌కీ పుకార్ కా, రంగ్ భరే ప్యార్ కా

గీత్ గాయా పత్థరోంనే.

రాళ్ల వంటి పెదిమల నుండి అందమైన, ఆహ్లాదకరమైన, ఉత్సాహభరితమైన జీవితపు పాట వెలువడింది. ప్రేమ వెయ్యి రంగులతో విలసిల్లింది. ఋతువు ఆలపించే బాణీ ఆధారంగా, అందమైన స్వరంలో హృదయంలోని ప్రేమ స్వరాన్ని వినిపిస్తూ రాళ్లు పాటలు పాడుతున్నాయి.

చెక్కిన రాతిలో మధుర

సీధువు లొల్కు విపించివా రవం

బుక్కునరాలలో పలుకు

లొత్తిన రీతి ధ్వనించునంట! ఏ

లెక్కలలో ఉలిని కదిపి

'రిం 'గను చక్కని మ్రోత రాతిలో

గ్రుక్కితి వయ్య! శిల్పికుల

కుంజరా!పుంజిత బ్రహ్మ తేజమా!

ఒక కళాకారుడు మరో కళాకారుడి ప్రతిభను గ్రహించి అచ్చెరువొంది రచించిన కవిత ఇది. ఇదే రకమైన ఆశ్చర్యం, ఆనందం అద్భుత భావన ' పథ్ రీలె హోటోంసె నిక్‌లా హై నగ్మా'లో కనిపిస్తుంది.

జబ్‌తక్ హై కాయం, యే ధర్తీ యే అంబర్

యాదోంకీ, ఆహోంకీ, గూంజా కరేంగే తరానే

అప్నేహీ సీనోం కీ యే బేకరారీ, దేఖా కరేంగే జమానే

హృదయ్ కీ బీన్ పర్, జీవన్ సితార పర్

దిల్‌కే పుకార్ కా రంగ్ భరే ప్యార్ కా

గీత్ గాయా పత్థరోంనే...

ఈ భూమి ఆకాశం ఉన్నంతవరకూ మన జ్ఞాపకాలు, నిట్టూర్పుల గీతాలు ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. మన హృదయాలలోని ఈ వ్యాకులత, ఉత్సుకతలు ప్రపంచం దర్శిస్తూనే ఉంటుంది. హృదయపు వీణపై, జీవితం సితార పై హృదయపు ప్రేమగీతాన్ని ఈ రాళ్లు పాడుతూనే ఉంటాయి. అత్యద్భుతం అనిపిస్తుంది.

ప్రతి వివాద శిలయూ ప్రతిమయై వెలుగొందు

పడతి వోలె కులికి వలపు రేపు:

నీ కరావలంబ నిభృతమైనపుడెల్ల

రాతి తరాతిలోన నాతి తోచు!

శిల్పి గొప్పతనాన్ని అత్యద్భుతంగా వర్ణించాడు దాశరథి. రాజులు పోతారు. రాజ్యాలు పోతాయి. కానీ శిల్పులు సృజించిన శిల్ప కళా సంపద ఆనాటి శిల్పుల సృజనాత్మకతకు, హృదయ సంవేదనలకు, సున్నితత్వపు ప్రతిభకు తార్కాణాల్లా నిలిచిపోతాయి, ఇదే విషయం సినిమా పాట చెప్తున్నది. దాశరథి కవిత అతి సుందరంగా ప్రదర్శిస్తున్నది.

సినిమాలో ఈ పాట మరోసారి వస్తుంది. సినిమా చివరలో వచ్చే ఈ పాటను ప్రఖ్యాత శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు కిషోరీ అమోన్‌కర్ గానం చేసింది. అత్యద్భుతమైన చిత్రీకరణ ఆ పాటది. రాజశ్రీ శాస్త్రీయ నృత్య ప్రతిభకు మచ్చుతునక ఈ పాట చిత్రీకరణ. మొదటిసారి పాట వచ్చిన సందర్భంలో వారి ప్రేమ వెల్లివిరుస్తున్నది. కానీ కాలక్రమేణా అపోహల వల్ల వాళ్లు దూరమైపోతారు. కళాకారుడిలో ప్రతిభ ఎక్కడికీ పోదు. కానీ తగిన ప్రేరణ ఉంటే బంగారానికి తావి అబ్బినట్టు, ప్రవహించే నీటికి దిశ దొరికినట్టు ఆ ప్రతిభ మరింతగా ప్రస్ఫుటమవుతుంది. ప్రేరణ లేని సమయలో ఎంత గొప్ప కళ సృజించినా కళాకారుడికి సంతృప్తి ఉండదు. ఆ కళలో ఏదో లోటు తోస్తుంది.

ఇన్సాన్ కీ ఛాహత్ భరి కల్పనానే

దిల్ ధీరే, భర్ ధీరే,

పత్థర్ మే వో నౌజనానీ

ఏక్ ఏక్ సూరత్ హై షకల్–ఎ– మోహబ్బత్

ఆంఖేథీ జిందగానీ

'ప్యార్ కే సురోంపర్, అప్నీ ధున్ మే

దిల్‌కీ పుకార్ కా రంగ్ భరే ప్యార్ కా

కళాకారుడు ఓ పెద్ద శిల్పం సృజిస్తాడు. కానీ సంతృప్తి ఉండదు. చివరికి అలాగే ఆ శిల్పాన్ని ఆవిష్కరిస్తారు. ఆ సమయంలో నృత్యం చేస్తూ పాట పాడేది తని భార్యనే, అతని ప్రేరణనే. ఆ విషయం అతనికి తెలియదు. కానీ అసంపూర్ణంగా ఉన్న శిల్పాన్ని ఆవిష్కరించటం పట్ల అతను వికల మనస్కుడై ఉంటాడు.

మనిషి ప్రేమపూరితమైన కల్పన రాళ్లల్లో నవయవ్వనాన్ని నింపుతుంది. ప్రతివదనం సదనం. కళ్లలో జీవం ఉట్టి పడుతుంది. ప్రేమ అనే శృతిలో, తనదైన స్వేచ్ఛ బాణీలో హృదయపు ప్రేమగానాన్ని ఆలపిస్తున్నాయి రాళ్లు.

నినుగని కొండలన్ని రమ

ణీ కుచ పాళికలై, భ్రకుటు

లై, కుటిలాలక జాలమై, సురాం

గనలయీ రూపు దిద్దికొన

గా ఉలితో అమృతమ్ము జల్లి జీ

వనములు పోసి పోయెదవు:

బ్రహ్మపు శిల్పి కులావతంసమా

హర్ ఎక్ పత్థర్ బర్సేగీ ఉల్ఫత్

హర్‌దం రహేంగే మిల్ కే

టుక్డే హై యే ఎక్ దిల్ కె

శాంతీ కే రాగ్ పర్, ఏక్తా కీ తాన్ పర్

దిల్‌కీ పుకార్ కా రంగ్ భరే ప్యార్‌కా

గీత్ గాయా పత్థరోంనే..

తీరా విగ్రహం ఆవిష్కరణ అయిన తరువాత శిల్పి ఆశ్చర్యపోతాడు. ఎందుకంటే తన శిల్పంలో ఏదో లోపం ఉందని బాధపడుతున్న శిల్పికి ఆ లోపం తొలిగి అత్యద్భుతమైన సంపూర్ణ శిల్పం కళ్లముందు కనిపిస్తుంది. ఆ శిల్పం చేతిలో పిల్లవాడిని ఉంచటంతో శిల్పం లోపం తొలుగుతుంది. ఆ లోపాన్ని పూడ్చింది శిల్పి కొడుకే. దాంతో భార్యాభర్తల నడుమ అపోహలు తొలిగి ఒకటవుతారు. సినిమా పూర్తవుతుంది. అసలు ఇలాంటి అత్యద్భుతమైన సినిమా మన కళాకారులు నిర్మించారన్న స్పృహ కూడా ఈనాడు అనేకులకు లేదు. కానీ ఎవరి మెప్పు కోసమో, ప్రశంసల కోసమో కాక తమ సంతృప్తి కోసం, హృదయలోతుల్లోంచి సృజించిన కళ చిరంజీవిగా నిలుస్తుంది. తరతరాలను ప్రభావితం చేస్తుంది. తన దగ్గరకు వచ్చిన వారిపై ఆనందపు వర్షం కురిపిస్తుంది.

'శిల్పి' గురించి ప్రస్తావన రాగానే మనస్సులో తప్పనిసరిగా మెదలుతుంది. 'అమర శిల్పి జక్కన'లో ఘంటసాల పాడిన నారాయణా రెడ్డి పాట.

ఈ నల్లని రాలలో

ఏ కన్నులు దాగెనో

ఈ బండల మాటున

ఏ గుండెలు మ్రోగెనో....

ఇక్కడ కవి పూర్తిగా వేరే దృక్కోణం తీసుకున్నారు. ఒక శిల్పి తాను కళను ప్రతిష్టించబోయే బండల మనస్సు గురించి ఆలోచిస్తున్నాడు. వాటిని అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. 'హిందీ' సినిమా శిల్పి సృజనాత్మక

హృదయంపై దృష్టి పెడితే, తెలుగుపాట శిల్పి సున్నిత హృదయాన్ని ఆవిష్కరిస్తోంది. హిందీలో పాట నేపథ్యగీతం. కాబట్టి శిల్పి గురించి, సృజన గురించి పాడే వీలుంటుంది. కానీ, తెలుగులో శిల్పి స్వయంగా పాడుతున్నాడు. కాబట్టి రాళ్ళ స్వభావం గురించి పాడటంలోనే ఔచిత్యం ఉంది.

పాపాలకు తాపాలకు బహు దూరములో నున్నవి

మునుల వోలె కారడవుల మూలలందు పడి ఉన్నవి .

కదల లేవు మెదలలేవు పెదివి విప్పి పలుకలేవు

ఉలి అలికిడి విన్నంతకె జలజలమని పొంగి పొరలు.

ఈ చరణం వినగానే 'నీ ఉలిని చూసి ప్రస్తరము నీరయి పారును' అన్న దాశరథి కవిత పాదం గుర్తుకు వస్తుంది. అదొక కోణం. ఇదొక కోణం.

పైన కఠినమనిపించును, లోన వెన్న కనిపించును

జీవమున్న మనిషి కన్న శిలలే నయమనిపించును.

అవును.. సృజనాత్మక ప్రతిభ, సున్నిత హృదయాలున్న మనుషులు సైతం సృజనను వదలి, సున్నితత్వాన్ని జీవన పోరాటం బరువు క్రింద నలిపి, మోడుల్లా జీవితాన్ని గడిపేస్తూంటే, తమలో భగవంతుడు సున్నిత భావాలను, సృజనాత్మక ప్రతిభను నిక్షిప్తం చేశాడన్న స్పృహ కూడా లేకుండా డబ్బు సంపాదనే జీవిత పరమావధి అన్నట్టు పశువులకన్నా ఘోరంగా(వాటికీ చైతన్యం వుండదు) జీవితం గానుగెద్దులా గడిపేస్తుంటే, 'జీవమున్న మనిషి కన్న శిలలే' నయమనిపిస్తాయి. హిందీలో, తెలుగులో, శిల్పి ప్రధాన పాత్రగా వచ్చిన ఈ రెండు సినిమాలు అనంతమైన సున్నిత భావాలను అద్భుతమైన రీతిలో భావి తరాలకు అందిస్తున్నాయి. వింటే వరహాలు రాలతాయి.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story